దేవరుప్పులలో కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్తున్న దయాకర్‌రావు

కార్యకర్తల కోసం జైలుకైనా పోతా..

అక్రమ అరెస్టులపై భగ్గుమన్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

- బీఆర్‌ఎస్ నాయకులకు బాసటగా నిలిచిన మాజీ మంత్రి
- దేవరుప్పుల చౌరస్తా నుంచి శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ
- వరంగల్ సీపీ హామీతో ఆందోళన విరమణ
- అసలు దోషులను అరెస్ట్ చేయాలని డిమాండ్
- 27వరకు సమస్య పరిష్కరించాలని గడువు
- లేకపోతే వేలాది మందితో ధర్నా చేస్తామని స్పష్టం

దేవరుప్పుల, సెప్టెంబర్ 21 : బీఆర్‌ఎస్ నాయకులకు బాసటగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నిలిచారు. అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ ఆందోళనకు దిగారు. పాలకుర్తి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా పోలీసు స్టేషన్‌కు బయలుదేరారు. న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ క్రమంలో సోమవారం వరకు సమస్యను పరిష్కరిస్తానని వరంగల్ సీపీ హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. వివరాల్లోకి వెళితే.. జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల మండలం చినమడూరులోని ధృవ వెంచర్ వ్యవహారంలో ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య గొడవ చోటుచేసుకుంది. ఇందులో కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకొని ప్రత్యర్థులను బెదిరించి కిడ్నాప్‌నకు పాల్పడ్డారు. దీనిని ఎత్తిచూపిన బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి మేరకు పోలీసులు చినమడూరుకు చెందిన మాజీ సర్పంచ్ వంగ పద్మ కుమారుడు అర్జున్, ఎంపీటీసీ గొడుగు సుజాత భర్త మల్లికార్జున్‌పై శనివారం అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నేతృత్వంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలిరావడంతో దేవరుప్పుల చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్‌కు ర్యాలీగా బయలుదేరారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని ఎర్రబెల్లి స్పష్టం చేశారు. ఈ క్రమంలో వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య ర్యాలీ వద్దకు చేరుకొని ఎర్రబెల్లికి నచ్చజెప్పే ప్రయత్నం చేయడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేసిన కాంగ్రెస్ నాయకులను వదిలి తమ వారిని ఎలా అరెస్ట్ చేస్తారని ఆయనను నిలదీశారు. అన్ని ఆధారాలను తాము ఇప్పటికే పోలీసులకు సమర్పించామని, బాధితుడిని చంపుతామని బెదిరించడంతో పోలీస్‌స్టేషన్‌కు రావడం లేదన్నారు. కాగా కిడ్నాప్‌కు గురైన బాధితుడు ఇప్పటికే పోలీసులకు పోస్టు ద్వారా ఫిర్యాదు పంపాడని, దానిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎర్రబెల్లి ప్రశ్నించారు. న్యాయం చేస్తామని జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ హామీ ఇవ్వాలని డిమాండ్ చేయడంతో ఆయన ఎర్రబెల్లితో ఫోన్‌లో మాట్లాడారు. తాను సోమవారం వరకు కేసు నమోదు చేస్తానని హామీ ఇవ్వడంతో ర్యాలీని నిలిపివేసి, రోడ్డు పక్కన ఓ ఇంట్లో బీఆర్‌ఎస్ శ్రేణులతో కూర్చున్నారు. అదే సమయంలో ఎర్రబెల్లికి వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా ఫోన్ చేసి తాను సోమవారం వరకు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో కిడ్నాప్‌నకు గురైన బాధితుడికి న్యాయం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ ఇచ్చిన పిటిషన్‌ను పార్టీ శ్రేణులతో కలిసి ఎస్సై సృజన్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ నేతృత్వంలో పాలకుర్తి, కొడకండ్ల, జఫర్‌ఘడ్, లింగాలఘనపురం, రఘునాథపల్లి ఎస్సైల ఆధ్వర్యంలో భారీగా పోలీసులను మోహరించారు.



పోలీసులతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి

అరెస్ట్ చేయకపోతే భారీ ధర్నా

పాలకుర్తిలో పోలీసులు అధికార పక్షాన ఉంటూ ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని మా జీ మంత్రి ఎర్రబెల్లి అన్నా రు. కాంగ్రెస్ నాయకులు పాండురంగం అనే వ్యక్తిని కి డ్నాప్ చేసి రెండు రోజులు ఓ ఇంట్లో నిర్బంధించి దేవరుప్పుల తహసీల్ కార్యాలయంలో అతనిచేత బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. బాధితుడు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులను ఆశ్రయించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని, దీనిని రెండు రోజులుగా మీడియా సమక్షంలో తమ నాయకులు ప్రశ్నిస్తుండడంతో అధికార పార్టీ నాయకులు కావాలని చినమడూరుకు చెందిన ఇద్దరిపై శనివారం అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపారన్నారు. సీపీ సోమవారం వరకు సమస్యను పరిష్కరిస్తానని, నిందితులపై కేసు నమోదు చేస్తానని హామీ ఇచ్చారని, అలా జరగని పక్షంలో ఈనెల 27న మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి వేలాది మంది బీఆర్‌ఎస్ శ్రేణులు రోడ్డెక్కే పరిస్థితి ఉంటుందని దయాకర్‌రావు హెచ్చరించారు. అధికారం ఉందని బీఆర్‌ఎస్ నాయకుల జోలికి వస్తే ఊరుకునేది లేదని, కార్యకర్తల కోసం అవసరమైతే జైలుకు పోతానని దయాకర్‌రావు స్పష్టం చేశారు.

ఎట్టకేలకు రైతుకు న్యాయం

ఎర్రం మల్లయ్యకు పట్టా పాస్ పుస్తకం అందజేసిన తహసీల్దార్

పర్వతగిరి, సెప్టెంబర్ 21 : ఎట్టకేలకు అధికారులు ఓ రైతుకు న్యాయం చేశారు. పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన రైతు ఎర్రం మల్లయ్యకు శనివారం తహసీల్దార్ వెంకటస్వామి తన భూమికి సంబంధించిన పట్టా పాస్‌పుస్తకాన్ని అందజేశారు. మల్లయ్య వ్యవసాయ భూమిని వేరొకరి పేరున తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అప్పటి తహసీల్దార్ కోమి పనిచేసిన సమయంలో పట్టా అయినట్లు పలు పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో రైతు మల్లయ్య తన భూమిని మరో వ్యక్తి పేరిట పట్టా చేశారని కలెక్టర్‌కు మొరపెట్టుకోగా విచారణకు ఆదేశించారు. దీంతో తహసీల్దార్ వెంకటస్వామి నేతృత్వంలో ఆ భూమిని సర్వే చేసి ఎర్రం మల్లయ్యదే అని నిర్ధారించి, శనివారం పట్టాపాస్ పుస్తకం అందజేశారు.

రైతు ఎర్రం మల్లయ్యకు పట్టాదారు పాసుపుస్తకం అందజేస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి

దీంతో రైతు మల్లయ్య, అతడి కొడుకు సంతోషం వ్యక్తం చేశారు. కొందరు చేసిన తప్పిదం వల్లే పట్టా మార్పిడి జరిగిందని, రైతు మల్లయ్య నష్టపోవద్దనే త్వరగా విచారణ చేసి, 25 గుంటల భూమిని రికార్డుల్లోకి ఎక్కించి పాస్‌బుక్ అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు. మిగతా భూమిని కూడా త్వరలోనే పాస్‌బుక్‌లో ఎక్కిస్తామన్నారు.

నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, ఆదివారం 22 సెప్టెంబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

గ్రంథాలయాలు విజ్ఞాన సర్వస్వాలు. జ్ఞానాన్ని పంచే పుస్తక భాండాగారాలు. మేధావులను తయారు చేసే నిలయాలు. ఒకప్పుడు ఇవి ఒక వెలుగు వెలిగినా, సాంకేతిక వ్యవస్థ అభివృద్ధితో కనుమరుగయ్యాయి. ఇలాంటి తరుణంలో హనుమకొండ జిల్లాలోని మారుమూల ప్రాంతమైన భీమదేవరపల్లి మండలం ముల్కనూరు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఓ అద్భుత గ్రంథాలయం రూపుదిద్దుకున్నది. ఆ గ్రామ పూర్వ విద్యార్థులు కొందరు కలిసి 2014లో ప్రజాగ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. కొందరి ఆలోచనతో మొదలైన ఈ గ్రంథాలయం దినదిన ప్రవర్ధమానంగా ఎదిగి ఇప్పుడు ముల్కనూరు ప్రజాగ్రంథాలయంగా ప్రసిద్ధికెక్కింది. నేడు దశాబ్ది ఉత్సవాలకు సిద్ధమైంది. ముల్కనూరు ప్రజా గ్రంథాలయం-నమస్తే తెలంగాణ దినపత్రిక భాగస్వామ్యంతో ఏటా జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న కథల పోటీలతో ఈ గ్రంథాలయం రాష్ట్రంలోనే ప్రాధాన్యతను సంతరించుకున్నది.

- హనుమకొండ సబర్బన్/ భీమదేవరపల్లి

ప్రజా గ్రంథాలయంలో పదేళ్ల పండుగ

నమస్తే తెలంగాణ-ముల్కనూరు లైబ్రరీ ఆధ్వర్యంలో నేడు దశాబ్ది ఉత్సవాలు

'నమస్తే తెలంగాణ' భాగస్వామ్యంతో..

ముల్కనూరు ప్రజాగ్రంథాలయం దశాబ్ది ఉత్సవాలకు సిద్ధమైంది. నమస్తే తెలంగాణ దినపత్రిక-ముల్కనూరు ప్రజాగ్రంథాలయం సంయుక్తంగా ఏటా కథల పోటీలు నిర్వహిస్తున్నది. ఇదే తరహాలో కథల పోటీలు - 2023 సంవత్సరానికి గాను ఇప్పటికే విజేతల ఎంపిక ప్రక్రియ పూర్తి కాగా, నేడు దశాబ్ది ఉత్సవాల వేదిక పైనే బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్ కుమార్, అల్లిగెడ్డి ప్రవీణ్‌రెడ్డి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, తెలుగు కవి అందెశ్రీ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, హనుమకొండ జడ్పీ మాజీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్, నమస్తే తెలంగాణ దినపత్రిక ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి హాజరుకానున్నట్లు నిర్వాహకులు సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ వంగ రవి తెలిపారు.

లైబ్రరీలో పాఠకులు

- పూర్వ విద్యార్థుల ఆలోచనతో రూపుదిద్దుకున్న గ్రంథాలయం
- దాతల సహకారంతో దినదిన ప్రవర్ధమానంగా ఎదిగిన పుస్తక భాండాగారం
- కథల పోటీలు-2023 విజేతలకు బహుమతుల ప్రదానం
- హాజరుకానున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హనుమకొండ జిల్లాలోని ముల్కనూరు గ్రామానికి చెందిన అనేకమంది విద్యార్థులు విద్యాభ్యాసం కోసం నిత్యం హనుమకొండ వంటి పట్టణాలకు వెళ్తుంటారు. అయితే, ఇతర సమయాల్లో ఇక్కడి విద్యార్థులు చదువుకునేందుకు పుస్తకాలు కానీ, ఇతర సదుపాయాలు కానీ అందుబాటులో ఉండేవి కాదు. చెప్పేవారు కూడా ఎవరూ లేకపోవడంతో పోటీ పరీక్షల్లో వెనుకబడేవారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ గ్రామంలో ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1982-83 పదో తరగతి విద్యార్థులు సరికొత్తగా ఆలోచించారు. వీరంతా ఒకసారి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. అందరిలా దావతులు చేసుకొని వెళ్లకుండా, చిరకాలం గుర్తుండేలా గ్రామానికి ఏదైనా మంచి చేయాలని తీర్మానించారు. ముందుగా స్పందన చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. మొదట గ్రామంలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. తర్వాత అందరూ ఆలోచించి మంచి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తే విద్యార్థులందరికీ ఉపయోగపడుతుందని భావించి ముల్కనూరు ప్రజాగ్రంథాలయం పేరిట లైబ్రరీని ఏర్పాటు చేశారు. ఇందులో ప్రస్తుత సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు ప్రధానపాత్ర పోషించారు. 2014లో ముల్కనూరు ప్రజాగ్రంథాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన కమిటీ సభ్యులకు పలువురు ప్రజాప్రతినిధులు విరివిగా సహకారాన్ని అందించారు. ముందుగా అప్పటి కరీంనగర్ జిల్లా కలెక్టర్ నీతూకుమారి ప్రసాద్ ఆదేశాలతో గ్రామం నడిబొడ్డున ప్రధాన రహదారి పక్కనే 8 గుంటల భూమిని కేటాయించారు. ఆ తర్వాత అప్పటి రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు రూ.10లక్షలు, అప్పటి ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ రూ.10లక్షలు, అప్పటి ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు రూ. 5లక్షలు వారి నిధులనుంచి కేటాయించగా, స్పందన చారిటబుల్ ట్రస్టు, ముల్కనూరు గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి మరో రూ. 10లక్షలు సమకూర్చారు. మంచి భవనాన్ని నిర్మించారు. దీనికి తోడు వేముల శ్రీనివాసులుతోపాటు ఇతరులు తమకున్న పరిచయాలతో పోటీ పరీక్షల కోసం అనేక రకాల పుస్తకాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ క్రమంలో రాష్ట్రంలోనే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గ్రంథాలయాల్లో తొలిసారి ముల్కనూరు ప్రజాగ్రంథాలయాన్ని డిజిటలైజేషన్‌గా మార్చారు.

నర్సంపేటవాసికి అరుదైన అవకాశం

పిన్న భాస్కర్‌కు అమెరికాలో ప్రధాని మోదీని కలిసే ఛాన్స్

పిన్న భాస్కర్

నర్సంపేట, సెప్టెంబర్ 21 : వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన పిన్న భాస్కర్‌కు అరుదైన అవకాశం దక్కింది. అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ క్వాడ్ మీటింగ్ కోసం ఆదివారం విల్మింగ్టన్ సిటీ వెళ్లనుండగా అక్కడ ఆయనకు స్వాగతం పలికే బృందంలో అమెరికాలో నివాసం ఉంటున్న భాస్కర్‌కు ఛాన్స్ వచ్చింది. భాస్కర్ సామాజిక, సాంస్కృతిక సేవలను గుర్తించి డెలావేర్రా ఇండియన్ కమ్యూనిటీ లీడర్‌షిప్ నుంచి భాస్కర్‌ను ఎంపిక చేయగా తనకు ఈ అవకాశం దక్కడం సంతోషంగా ఉందని చెప్పారు.

ప్రశాంత్‌కు శిక్షణ ఉత్తర్వు కాపీని అందజేస్తున్న సీపీ

సైబర్ కమాండో శిక్షణకు ప్రశాంత్ ఎంపిక

సుబేదారి, సెప్టెంబర్ 21 : సైబర్ నేరాలను కట్టడి చేయడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ కమాండో శిక్షణకు తెలంగాణ స్టేట్ నుంచి వరంగల్ పోలీసు కమిషనరేట్ డిప్యూటీ ఏవోగా పనిచేస్తున్న ఏ ప్రశాంత్ ఎంపికయ్యారు. శనివారం హనుమకొండలోని వరంగల్ కమిషనరేట్‌లో సీపీ అంబర్ కిశోర్ ఝా ప్రశాంత్‌కు శిక్షణ ఉత్తర్వు కాపీని అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా పోలీసు, పారా మిలటరీ, భద్రతా దళాల్లో పనిచేస్తున్న సాంకేతిక రంగంలో నైపుణ్యం కలిగిన వారిని పరీక్ష ద్వారా కేంద్ర ప్రభుత్వ సైబర్ కమాండో విభాగానికి ఎంపిక చేసిందన్నారు. తెలంగాణ నుంచి ప్రశాంత్ ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. తమిళనాడు తిరుచ్చిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తారని తెలిపారు.

- తారస్థాయికి వర్గపోరు..
- అధిష్ఠానానికి చేరిన పంచాయతీ
- గాంధీభవన్‌లో పరస్పరం ఫిర్యాదులు
- పీసీసీ, ఇన్‌చార్జి మంత్రి, క్రమశిక్షణ సంఘం చైర్మన్‌కు నాయకుల వినతి

గాంధీభవన్‌లో పీసీసీ చీఫ్, క్రమశిక్షణ సంఘం చైర్మన్‌కు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరిపై ఫిర్యాదు చేసిన వ్యతిరేకవర్గం నాయకులు

ఢీ ఛీఛీ..

జనగామ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు

జనగామ, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : అధికారం ఉన్నా, లేకపోయినా అంతర్గపోరు మాత్రం కాంగ్రెస్ పార్టీని వీడడం లేదు. అంతర్గత కుమ్ములాటలు, వ్యక్తిగత దూషణలతో కొందరు నాయకులు ఆ పార్టీ పరువును బజారుకీడ్చేలా వ్యవహరిస్తున్నారు. తాజాగా, జనగామ కాంగ్రెస్ నాయకుల మధ్య కుమ్ములాటలు తారాస్థాయికి చేరి, పంచాయతీ అధిష్ఠానం వద్దకు చేరింది. గాంధీభవన్‌లో రెండు గ్రూపుల నాయకులు ఎవరికి వారే పరస్పరం అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసుకున్నారు. అభ్యర్థి ఓటమికి కారణమై, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, ప్రభుత్వ కార్యక్రమాలను అభాసుపాలు చేసిన అసమ్మతి నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి నివేదిక రూపంలో ఫిర్యాదు చేశారు. మరుసటి రోజే శనివారం కొమ్మూరి నాయకత్వంపై తిరుగుబాటు జెండా ఎగరేసిన సీనియర్ నాయకులు కొందరు తన ఒంటెద్దు పోకడలతో పార్టీని నిర్వీర్యం చేస్తూ 'ఢీఛీఛీ' అధ్యక్షుడిగా పేరు తెచ్చుకున్న కొమ్మూరిపై చర్యలు తీసుకోవాలని పీసీసీ చీఫ్ సహా ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ కోదండరెడ్డికి ఫిర్యాదు చేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ సీనియర్లతో సఖ్యతగానే ఉన్నట్లు కనిపిస్తూ కలిసి పనిచేసిన డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ఓటమి తర్వాత 'అంతా వాళ్లే చేశారు.. వెనక ఉండి ముందు గోతులు తీశారు'.. 'కాదు..కాదు అభ్యర్థి ఒంటెత్తు పోకడల వల్లే..పార్టీ ఓడింది'..అంటూ పార్టీ అంతర్గత సమావేశాల్లో గ్రూపులుగా విడిపోయి వ్యక్తిగత దూషణలతో బాహాబాహీకి దిగి సోషల్ మీడియాలో పెట్టిన వ్యతిరేక పోస్టులను వైరల్ చేశారు. అప్పటి నుంచి డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి, పార్టీ సీనియర్ నాయకులకు మధ్య పూడ్చలేనంతగా గ్యాప్ పెరిగి రెండు గ్రూపులుగా విడిపోయారు. వ్యతిరేకవర్గం నాయకులంతా భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆయన సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో సఖ్యతగా మెలుగుతూ వస్తున్నారు. మంత్రుల పర్యటనలు, అధికారిక కార్యక్రమాల సందర్భాల్లో గ్రూపుల వారీగా విడివిడిగా స్వాగతాలు పలకడం.. సత్కారాలు చేయడం, డీసీసీ అధ్యక్షుడి ఫొటో లేకుండా ప్రధాన కూడళ్లల్లో ఫ్లెక్సీలు కట్టడం వంటి చర్యలతో జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి 'హస్త'వ్యస్థంగా మారింది. అధికారంలోకి వచ్చిన 9 నెలల నుంచి లోలోపల గ్రూపుల కొట్లాటలు.. నాయకుల మధ్య కుమ్ములాటలు.. అసమ్మతి సమావేశాలతో గుంభనంగా ఉన్న వర్గపోరు సెప్టెంబర్ 17న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన 'ప్రజాపాలన' అధికారిక వేదికపైనే బయటపడింది. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సమక్షంలోనే సొంత పార్టీ నాయకుల నుంచే డీసీసీ అధ్యక్షుడికి నిరసన సెగ తాకింది. ఏ హోదాలో కొమ్మూరిని వేదికపై కూర్చోబెట్టారంటూ పార్టీ నాయకులే జిల్లా అధికారులను నిలదీసి కిందకు దిగే దాక అసమ్మతి నాయకులు పట్టుబట్టారు. కొమ్మూరి అనుకూల, వ్యతిరేక వర్గీయులు వాగ్వాదానికి దిగారు. 'నువ్వెంత..అంటే నువ్వెంత'..'నీ సంగతి చూస్తా.. అంటే, నీ సంగతి కూడా చూస్తా'..'మీలాంటి వారి వల్లే పార్టీ భ్రష్టుపడుతున్నది.., కాదు మీ వల్లే జనగామలో కాంగ్రెస్ సర్వనాశనం అవుతున్నది' అంటూ పరస్పరం వ్యక్తిగతంగా దూషించుకున్నారు.

- తాజాగా వరంగల్‌లో మూడు, మానుకోట జిల్లాలో ఒక చోట దాడులు
- కోట్లాది రూపాయల ధాన్యం మాయమైనట్లు నిర్ధారణ
- నిల్వలు లేకపోవడంతో యజమానులపై క్రిమినల్ కేసులు
- రూ.35.52 కోట్ల ధాన్యం లేదని గుర్తింపు

రైస్‌మిల్లర్లపై కొరడా

కురవి: నవ్య ఇండస్ట్రీస్‌లో ధాన్యం తనిఖీ చేస్తున్న అధికారులు

వరంగల్, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ)/హనుమకొండ/కురవి : ప్రభుత్వం నుంచి ధాన్యం పొంది కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) డెలివరీ చేయని రైస్‌మిల్లులపై పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్థానిక అధికారులతో కలిసి శుక్ర, శనివారాల్లో దాడులు చేశారు. వరంగల్ జిల్లాలో మూడు రైస్‌మిల్లుల్లో 2022-23 రబీ సీజన్‌లో ప్రభుత్వం కేటాయించిన సుమారు రూ.27.16 కోట్ల ధాన్యం లేదని గుర్తించారు. దీంతో ఈ మూడు మిల్లుల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు ధాన్యం లేదని తేలడంతో వాటిని సీజ్ చేశారు. వర్ధన్నపేట మండలం ఇల్లందలోని లక్ష్మీశ్రీగణపతి రైస్‌మిల్లు, సంగెం మండలం కాపులకనపర్తిలోని సతీశ్, సాయి ఇండస్ట్రీ రైస్‌మిల్లులకు సీఎంఆర్ కోసం ధాన్యం కేటాయించింది. ఈ ధాన్యాన్ని సదరు రైస్‌మిల్లర్లు నూర్పిడి చేసి ప్రభుత్వానికి సీఎంఆర్ డెలివరీ చేయాల్సి ఉండగా చేయలేదు. ప్రభుత్వం పలుమార్లు గడువు ఇచ్చినా రైస్‌మిల్లర్లు పెడచెవిన పెట్టడంతో అధికారులను రంగంలోకి దింపింది. ఇల్లందలోని లక్ష్మీశ్రీగణపతి రైస్‌మిల్లులో సుమారు 4,691, కాపులకనపర్తిలోని సతీశ్ ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులో 3,532, సాయి ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులో 2,588 టన్నుల ధాన్యం నిల్వలు లేవని గుర్తించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి వెల్లడించారు. ప్రభుత్వ ధర ప్రకారం లక్ష్మీశ్రీగణపతి రైస్‌మిల్లులో లేని ధాన్యం విలువ రూ.11.21 కోట్లని, 25శాతం పెనాల్టీతో ఇది రూ.15 కోట్లకు చేరిందని జిల్లా మేనేజర్ సంధ్యారాణి తెలిపారు. అలాగే సతీశ్ ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులో లేని ధాన్యం విలువ రూ.9.64 కోట్లు కాగా పెనాల్టీతో రూ.13 కోట్లకు పెరిగినట్లు ఆమె చెప్పారు. శ్రీసాయి ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులో లేని ధాన్యం విలువ రూ.6.31 కోట్లు కాగా పెనాల్టీతో ఇది రూ.8.65 కోట్లకు చేరిందని డీఎం తెలిపారు. ఈ మూడు రైస్‌మిల్లుల యజమానులు కే శ్రీనివాస్, సతీశ్, సురేశ్‌పై క్రిమినల్ కేసుల నమోదు కోసం వర్ధన్నపేట, సంగెం పోలీస్‌స్టేషన్లలో శనివారం ఫిర్యాదు చేయడంతో పాటు మూడు రైస్‌మిల్లులను సీజ్ చేసినట్లు సంధ్యారాణి తెలిపారు.

కురవిలో రూ.8.36 కోట్ల ధాన్యం పక్కదారి

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మొగిలిచర్లలోని నవ్య ఇండస్ట్రీస్(పారాబాయిల్డ్ రైస్‌మిల్లు)పై శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 2022-23 రబీ సీజనలో ప్రభుత్వం మిల్లుకు 53,560 క్వింటాళ్ల ధాన్యాన్ని కేటాయించగా 36,420 క్వింటాళ్ల బియ్యాన్ని సీఎంఆర్ పెట్టాల్సి ఉంది. కానీ కేవలం ఇప్పటివరకు 8,871 క్వింటాళ్ల బియ్యం మాత్రమే ప్రభుత్వానికి అందచేయగా తనిఖీల్లో కేవలం 6,238 క్వింటాళ్ల మాత్రమే నిల్వ ఉన్నట్లు తేలింది. 34,275 క్వింటాళ్ల వ్యత్యాసం రాగా వాటి విలువ రూ.8కోట్ల 36లక్షల 94వేల 755 ఉంటుందని ఓఎస్డీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు తెలిపారు. మిల్లు యజమాని నాగరాజుపై కేసు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. దాడుల్లో జిల్లా సివిల్ సప్లై అధికారి కృష్ణవేణి, ఏఎస్‌వో రమేశ్, రవీందర్, ఆర్ఐ లక్ష్మి పాల్గొన్నారు.

హనుమకొండ జిల్లాలో ఇద్దరు రైస్‌మిల్లు యజమానులపై కేసు

హనుమకొండ జిల్లాలో ఎల్కతుర్తి మండలం సూరారంలోని శ్రీబాలాజీ ఇండస్ట్రీస్, ఐనవోలు మండలం పున్నేలులోని నారాయణ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లుల యజమానులపై పోలీస్‌స్టేషన్లలో క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు డీసీఎస్‌వో ఉమారాణి తెలిపారు. ఈ రెండు మిల్లుల్లో శుక్రవారం దాడులు చేసిన అధికారులు ఇచ్చిన ధాన్యం, పెట్టాల్సిన సీఎంఆర్ బియ్యం, పెట్టిన బియ్యం, ఉండాల్సిన వాటిలో పెద్ద మొత్తంలో తేడాలు ఉన్నట్లు గుర్తించారని, శ్రీబాలాజీ ఇండస్ట్రీస్‌లో మాయమైన బియ్యం బస్తాల విలువ సుమారు రూ.11.78కోట్లు ఉంటుందని, నారాయణ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో రూ.7.12కోట్లు విలువైన బియ్యం మాయమైందని నివేదిక సమర్పించారు. దీంతో మిల్లుల యజమానులపై శనివారం క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు.

బడిలోకి భారీ కొండ చిలువ

రాక్ పైథాన్‌ను బంధించిన అటవీ అధికారులు

పాఠశాలలో భారీ కొండచిలువను బంధించి తీసుకెళ్తున్న అటవీ అధికారులు

శాయంపేట, సెప్టెంబర్ 21 : శాయంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోకి భారీ కొండ చిలువ(రాక్ పైథాన్) దూరిన ఘటన శనివారం జరిగింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయకంపితులయ్యారు. వెంటనే అటవీశాఖ అధికారులకు హెచ్ఎం సురేందర్ సమాచారం ఇచ్చారు. డిప్యూటీ రేంజ్ అధికారి మైసయ్య పాఠశాలకు చేరుకుని స్థానికుల సాయంతో స్కూల్ వెనుక చిత్తడి ప్రదేశంలో ఉన్న కొండచిలువను బంధించారు. ఎనిమిది అడుగుల పొడవు, ఇరవై కిలోల బరువున్న పైథాన్‌ను కాత్రపల్లి అడవుల్లో వదిలేశారు.

ధాన్యం సేకరణకు సంసిద్ధం

'నమస్తే' కథనానికి స్పందించిన పౌర సరఫరాల శాఖ

ములుగు, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ) : వానకాలం సీజన్‌లో రైతులు పండించే ధాన్యం సేకరణకు సంసిద్ధంగా ఉన్నామని, దీనిని పూర్తిగా తమ శాఖ ద్వారానే చేపడతామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఫైజల్ హుస్సేనీ శనివారం తెలిపారు. 'ధాన్యం సేకరణకు వెనుకడుగు' శీర్షికన 'నమస్తేతెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి ఆయన వివరణ ఇచ్చారు. ఈ నెల 19న కలెక్టర్, అదనపు కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో పాటు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బాధ్యులతో ధాన్యం కొనుగోళ్లపై సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ధాన్యం సేకరణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారన్నారు. అనంతరం రైస్ మిల్లర్స్ అసోషియేషన్ బాధ్యులు కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్‌ను కలిసి ధాన్యం కొనుగోళ్లలో పాల్గొనేందుకు తాము సుముఖంగా ఉన్నామని, పాత పాలసీ ప్రకారం ధాన్యం సేకరించలేమని వినతి పత్రం ఇచ్చారన్నారు. మిల్లింగ్ చార్జీలు కూడా పెంచాలని కోరారని, లేని పక్షంలో తాము ఆర్థికంగా నష్టపోతామని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించినట్లు ఫైజల్ హుస్సేనీ పేర్కొన్నారు.